# అమ్మకడుపు చల్లగా - 2

## - గొల్లపూడి మారుతీరావు



స్వర్గీయ గొల్లపూడి మారుతిరావుగారి ఆత్మకథ 'అమ్మకడుపు చల్లగా' ఇప్పటికి పదకొండు సంవత్సరాలుగా మార్కెట్‌లో ఉన్న సంగతి పాఠకులకు విదితమే. అందులో మారుతిరావుగారు 2007 వరకూ తన జీవితంలో జరిగిన సంఘటనలను అత్యంత ఆసక్తికరంగా పాఠకులకు అందించారు. దానికి కొనసాగింపుగా 2007 నుంచి తనజీవితంలోని ముఖ్యమైన సంఘటనలను, క్రిందటి సంవత్సరమే, వ్రాయడం ప్రారంభించారు. అనారోగ్యకారణాలవల్ల దాన్ని పూర్తిచేయలేకపోయారు. ఆయన వ్రాసిన కొద్దిపేజీలను వ్రాసిన వెంటనే, 2018 నవంబర్‌లో, కౌముదికి పంపించారు. పూర్తిచేసి ఉంటే ఆ పుస్తకానికి ఏమి పేరు పెట్టి ఉండేవారో! ఆ అసంపూర్తి రచనను అమ్మకడుపు చల్లగా - 2 గా కౌముది పాఠకులకు ఈ నెల నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**నా జీవితంలో** చాలా సంస్థలు ఉదారంగా నాకు బిరుదులిచ్చాయి. అవన్నీ నన్ను వెక్కిరించినట్టుంటాయి. ఏదీ నా పేరుకి తగిలించుకోను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఓ ఉగాదినాడు దాదాపు ఓ నలభై ఏభై మందికి మూక ఉమ్మడిగా 'కళారత్న (హంస) బిరుదులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారి చేతులు మీదుగా ఉదారంగా పంచిపెట్టింది. మోయడానికి వీలులేనంత బరువైన హంస విగ్రహం, ఓ శాలువా. ఒక్కనాడూ దాన్ని నా పేరుకి తగిలించుకోలేదు. ముమ్మిడివరం రోటరీ క్లబ్బు "సాహితీ రత్న" అన్నారు. ఇలాంటి బిరుదులు కుప్పలు కుప్పలు. ఏవొక్కటీ మనస్సుదాకా పోలేదు.

చాలా సభల్లో, ఆహ్వాన పత్రాలలో నా పేరుకి ముందు 'డాక్టర్' తగిలించిన సందర్భాలు చాలా ఉన్నాయి. పోలీసోడికి పాము మంత్రం రాదా అన్నట్టు ఇంత వయసొచ్చిన రచయితకి డాక్టరేటు ఉండదా అని వారి ధైర్యం. ఆ సభల్లో విధిగా చెప్పేవాడిని "బాబూ! నేనింకా పేషెంటునే. డాక్టర్‌ని కాను" అని.

న్యాయంగా 58 సంవత్సరాల కిందట చదివిన నా మాతృ సంస్థ ఆంధ్రా విశ్వవిద్యాలయం ఆ పని చెయ్యాలి. ఒకటి రెండుసార్లు మరేవో విశ్వవిద్యాలయాలు ఆ ప్రయత్నం చెయ్యడం నాకు తెలుసు.

ఎట్టకేలకు విశాఖపట్నం గీతం విశ్వవిద్యాలయం ఆ ఘనతని నాకు సంపాదించిపెట్టింది. "మీకెప్పుడో ఇవ్వాలి మారుతీరావుగారూ" అంటూ ఏవో కారణాలు గొణిగారు.

ఎమ్.వి.వివిస్ మూర్తిగారు. అయితే చాలా ఘనంగా, గొప్పగా స్నాతకోత్సవం జరిగింది. పద్మశ్రీ డాక్టర్ బద్వే అనే బొంబాయి శాస్త్రకారునికి కూడా ఆ సంవత్సరం డాక్టరేటు ఇచ్చారు. ఆ ఉత్సవానికి నా కుటుంబం అంతా హాజరయింది.

ఆ ఉత్సవంలో నా కృతజ్ఞతా పూర్వకమైన ప్రసంగం హైలైట్. మరునాడు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రసాదరావుగారు ఒక మనిషిద్వారా ఉత్తరాన్ని పంపుతూ “Thanks for your electrifying speech” అని అభినందించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ "నేను నా రోజుల్లో ఆంధ్రా విశ్వవిద్యాలయంలో అతి నేలబారు విద్యార్థిని. కాని నా మనస్సుకి దగ్గరగా ఉన్న 'అభిరుచి'ని

పెంపొందించుకుని యూనివర్సిటీనుంచి బయటికి వచ్చాను. తర్వాత 56 సంవత్సరాలు ప్రయాణం చేసి ఎట్టకేలకు మరో యూనివర్సిటీకి (గీతం) చేరాను. డిగ్రీ చేతికి రావడానికి మీకు మూడేళ్ళు పట్టింది. నాకు మనస్సుకు నచ్చిన వ్యావృత్తిలో డిగ్రీ రావడానికి 64 సంవత్సరాలు పట్టింది" ఇలా సాగింది నా ప్రసంగం.

ఉత్సవం తరువాత ఎమ్.వి.వి.ఎస్ మూర్తిగారు హార్ధికంగా అభినందిస్తూ రిజిస్ట్రార్ని పిలిచి "డిగ్రీ ఇవ్వడమే కాదు. వీరికి విజిటింగ్ కార్డులు, లెటర్ హెడ్స్ ముద్రించి పంపండి" అన్నారు.

అద్భుతమైన ఆల్బంతో పాటు, అవన్నీ స్వయంగా తెచ్చి ఇచ్చారు రిజిస్ట్రార్గారు. కానీ నా విజిటింగ్ కార్డు ఎవరికి ఇవ్వను? సినిమావాడిగా నా ఫోన్ నంబరు 'అల్లరి'కి మూలకారణమవుతుంది.

దురదృష్టం మూర్తిగారు దారుణమయిన ఆక్సిడెంటులో అమెరికాలో కన్నుమూశారు.

అయితే ఇప్పటికీ ఎన్నడూ నా పేరుకి ముందు 'డాక్టర్' తగిలించుకోను. నాకు వచ్చే ప్రతీ ఉత్తరంలోనూ 'డాక్టర్' తప్పనిసరిగా ఉంటుంది.

పైవారు చూపినప్పుడు ఆ 'మర్యాద'కి రుచి పెరుగుతుందనుకుంటాను.

ఒక విచారకరమైన సందర్భం ఎప్పుడూ జ్ఞాపకం వస్తూంటుంది. మిత్రుడు, రచయిత, నటుడు పులికంటి కృష్ణారెడ్డి సాహితీపరులకు ఏటేటా సత్కారం చేయతలపెట్టాడు. కష్టపడి పైకొచ్చినవాడు. సమర్ధుడు - సాటి ప్రముఖులను సత్కరించడం గొప్ప సంస్కారం.

ఒక సంవత్సరం నాకు సత్కారం చేయనున్నట్టు ఫోన్ చేశాడు. చాలా ఆనందించాను. సత్కార సభలో చదవడానికి నా గురించి ఒక పద్యం రాసి పెట్టుకున్నాడు.

గొల్లపూడివారి గురుతరమౌ ప్రజ్ఞ
నటన నవల కథల పుటము వెట్టె
తమిళనాట కీర్తి తనకు తానే స్ఫూర్తి
సకరింప జన్మ సఫలమాయె

సభ 2007 జనవరి 27న తిరుపతిలో జరిగింది. నాతోపాటు సత్కారమందుకున్న మరొక పండితులు, ప్రజ్ఞాధురీణులు శలాక రఘునాధ శర్మగారు. విషాదం ఏమిటంటే ఆనాటికి కృష్ణారెడ్డి లేడు. కుటుంబ సభ్యులు సత్కారం జరిపారు. అందరి కళ్ళల్లో నీళ్ళు. ప్రసంగించే నా కంటిలో కూడా నా ప్రసంగానికి ఆఖరి వాక్యం గుర్తుంది. "తెలుగుదేశానికి కృష్ణారెడ్డి రాయలసీమ చిన్నోడు. కానీ ఇవాళ 'పెద్దోడు' అయిపోయాడు" తర్వాత మాట రాలేదు. ప్రసంగం ఆగిపోయింది.

మనస్సుకి దగ్గరగా వచ్చిన ఒక సత్కారం 2009 సెప్టెంబరు 10న జరిగింది. ఏదో ప్రసంగమంటూ ఫోన్ చేసి రానూపోనూ విమానం ఖర్చులు ఇచ్చారు మిత్రులు వోలేటి పార్వతీశం. తీరా హైదరాబాదు దూరదర్శన్కి చేరాక తెలిసింది. మనదేశంలో దూరదర్శన్ ప్రసారాలు ప్రారంభమయి 50 సంవత్సరాలయింది. ఆ సందర్భంగా దూరదర్శన్తో బంధుత్వమున్న ఓ 'పెద్ద'ని సత్కరించాలని పూనుకున్నారు దూరదర్శన్ అధికారులు. అప్పుడు డైరెక్టర్ మధుసూధనరావుగారు. నన్ను ఎంపిక చేశారు. ఈ సత్కారం సరాసరి ప్రసారం. 20 సంవత్సరాలు పనిచేసిన నా మాతృ సంస్థ జరుపుతున్న సత్కారం నిజంగా హృదయాన్ని తాకింది. ఆ మాటే నా ప్రసంగంలో చెప్పాను.

ఒక్కొక్కప్పుడు సత్కారానికి హంగు, ఆర్భాటం అక్కరలేదు. మనస్సులోంచి వచ్చే, ఇచ్చే గౌరవం కలకాలం గుర్తుండిపోతుంది.

తిరుమల తిరుపతి దేవస్థానం విద్యాలయంలో పనిచేస్తున్న ముదివర్తి కొండమాచార్యులుగారు వయస్సులో నాకన్నా పెద్ద. ఉన్నట్టుండి తాము వ్రాసిన తొమ్మిది పుస్తకాలను పంపుతూ ముందు ఒక పేజీలో ఒక పద్యాన్ని రాశారు.

బహు చలన చిత్ర నటునిన్

బహు రమ్యవచో విలాస బహుకృతి కర్తన్

బహు కవి మిత్రుని మెచ్చెద

మహనీయుని గొల్లపూడి మారుతి రావున్

ఈ పద్యం మనస్సులో నిలిచిపోయింది 'బహు కవి' కాస్త ఇబ్బంది పెడుతున్నా.

అయితే మూడు సత్కారాలు మనస్సుదాకా పోయినవి యిక్కడ ఉటంకించాలి.

ఏటేటా గుంటూరులో అతి సంప్రదాయ యుక్తంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే మిత్రులు ఒకాయన ఉన్నారు. సింగం లక్ష్మీనారాయణగారు. ఆయన నాకూ, నా కాలమ్‌కీ వీర భక్తుడు. జింఖానా క్లబ్బు ఆవరణలో వేదికమీద కుర్తాళం పీఠాధిపతి సిద్ధేంద్ర స్వామివారుండగా భువనచంద్ర, జొన్నవిత్తుల, కడియాల రామమోహనరాయ్ వంటివారుండగా నాకు 2009 ఉగాదికి కొండముది శ్రీరామచంద్రమూర్తి పురస్కారాన్ని ఇచ్చి సత్కరించారు. ఆ పేరు వినగానే మనస్సు జివ్వుమంది. కారణం యూనివర్సిటీలో చదువుకునే రోజుల్లో శ్రీరామ చంద్రమూర్తిగారు నాకు ఒక సంవత్సరం సీనియర్. జీవితంలో ఎన్నో సందర్భాలలో తారసపడిన మిత్రుడు. ఆ రోజుల్లోనే ఆయన రాసిన నాటిక 'గడ్డిపూలు' విజయనగరం రాఘవ స్మారక నాటక పోటీలలో ప్రదర్శించాను. 46 సంవత్సరాలుగ అవిచ్ఛన్నంగా సాగుతున్న నా కాలమ్‌కి 'జీవనకాలమ్' అని నామకరణం చేసిన హితుడు. నన్ను సత్కరించి, ఆయన కూతురు, అల్లుడు పాదాభివందనం చేశారు. ఇది నా తరం మిత్రుడే జ్ఞాపకంగా మారిన బాధాకరమైన సందర్భం.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments